సాక్షి చిత్తూరు

శుక్రవారం । 7 । జూన్ । 2024



గొంతులోకి నేరుగా గరళం

మినరల్ పేరుతో దోపిడీ జరుగుతోంది. అసలు కంపెనీని పోలిన నకలీ బాటిళ్ల విక్రయం ఎక్కువైంది. - 8లో



జిల్లా పోలీసులకు ప్రశంసలు

సార్వత్రిక ఎన్నికల్లో చట్టాన్ని నిక్కచ్చిగా అమలు చేసిన జిల్లా పోలీసు యంత్రాంగానికి ప్రశంసలు లభించాయి. - 8లో



బీసీజీ వ్యాక్సిన్‌పై అపోహలు వద్దు

క్షయ వ్యాధి నివారణ కోసం వేస్తున్న బీసీజీ వ్యాక్సిన్‌పై అపోహలు వద్దని జిల్లా క్షయ నివారణాధికారి వెంకటప్రసాద్ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

కుప్పంలో పెరిగిన ఫ్యాన్ గ్రాఫ్

కుప్పం : టీడీపీ కంచుకోటగా ఉన్న కుప్పంలో ప్రతి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓట్ల శాతం పెరుగుతోంది. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు 47,324 ఓట్ల మెజారిటీతో ఎనిమిదో సారి విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో 2014 నుంచి ఎన్నికల నుంచి వైఎస్సార్ సీపీ పోటీ చేస్తోంది. విశ్రాంత ఐఏఎస్ అధికారి చంద్రబాబు వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా 2014లో చంద్రబాబుపై పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో ఆయన 55,839 ఓట్లు సాధించారు. చంద్రమౌళి మరణానంతరం ఆయన కుమారుడు భరత్ పార్టీ అభ్యున్నతికి కృషి చేశారు. 2019 ఎన్నికల్లో 69,424 ఓట్లు వైఎస్సార్‌కి రావడంతో 13,585 ఓట్లు వైఎస్సార్ గ్రాఫ్ పెంచుకుంది. ప్రస్తుత ఎన్నికలో 73,923 వచ్చాయి. దీంతో ఈ సారి ఎన్నికల్లో 4,299 ఓట్లు వైఎస్సార్ సీపీకి పెరిగింది. ప్రతి ఎన్నికల్లో ఓట్లు శాతం పెరుగుతుండడం గమనార్హం.

ప్రభుత్వ సలహాదారు పదవికి జ్ఞానేంద్రరెడ్డి రాజీనామా



జ్ఞానేంద్రరెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): ఎస్ఆర్ఐ ప్రభుత్వ సలహాదారు పదవికి మహా సముద్రం జ్ఞానేంద్రరెడ్డి గురువారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను సీఎస్ జవహార్‌రెడ్డికి పంపారు. 2024 ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తూ తన పదవికి రాజీనామ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్ పదవికి..



అమ్ము

పుంగనూరు: వక్ఫ్ బోర్డు చిత్తూరు జిల్లా చైర్మన్ పదవికి అమ్ము రాజీనామా చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి కావడంతో స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు ప్రకటించారు. తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పొలాలపై ఏనుగుల దాడి



దెబ్బతిన్న టమాట పొలం

నదుం: మండలంలోని చెరుకువారిపల్లె పంచాయతీ పోతంవారిపల్లె సమీప పంట పొలాలపై ఏనుగులు బుధవారం రాత్రి విరుచుకు పడ్డాయి. గురువారం ఉదయం రైతులు పొలాల వద్దకు వెళ్లిన సమయంలో పంటలు ధ్వంసమై ఉండడాన్ని గుర్తించారు. బాధిత రైతు ప్రకాష్ మాట్లాడుతూ అటవీ సమీప ప్రాంతంలోని ఎకరా టమాట పొలంలో ఏనుగులు విధ్వంసం సృష్టించాయని తెలిపారు. పంట పూర్తిగా దెబ్బతినిందని పేర్కొన్నారు. అలాగే మామిడి తోటల్లో కొమ్మలను సైతం విరిచి వేశాయి.

ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా గురువారం ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. డీఈఓ దేవరాజు విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సప్లిమెంటరీ పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌లు లేవని తెలిపారు. గురువారం పదవ తరగతి గణితం, భారతీయ సంస్కృతి, వారసత్వం పరీక్షలు జరిగాయన్నారు. పరీక్షలకు 209 మంది అభ్యర్థులకు గాను 145 మంది హాజరయ్యారన్నారు. ఇంటర్‌కుకు 334 మందికి గాను 242 మంది హాజరయ్యారని తెలిపారు. జిల్లాలోని కుప్పం, పలమనేరు లో 3 పరీక్ష కేంద్రాలను, చిత్తూరులోని 5 పరీక్ష కేంద్రాలను అబ్జర్వర్ ప్రసన్న కుమార్ ఆకస్మికంగా తనిఖీలు చేశారన్నారు.

తామేలు!

- తాబేళ్లతో సముద్ర జలాల్లో సమతుల్యత
- జీవవైవిధ్యానికి ఎంతో మేలు
- నానాటికీ అంతరించిపోతున్న కచ్ఛపములు
- సంరక్షణ బాధ్యత తీసుకున్న అటవీ, వైల్డ్ లైఫ్ అధికారులు
- పదేళ్లుగా సముద్రంలోకి తాబేలు పిల్లలు వదులుతున్న వైనం
- హేచరీలు ఏర్పాటు చేసి మరీ సంరక్షణ
- ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపు

తాబేళ్లు సముద్ర జీవకోటి మనుగడకు ఎంతో మేలు చేస్తాయని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. సముద్రంలోని బండ రాళ్లపై ఉన్న నాచుని తినడం వల్ల మత్స్యసంపద వృద్ధి చెందుతుందని చెబుతున్నారు. అలాగే మత్స్యసంపదకు సింహస్వప్నంగా తయారైన జెల్లీ ఫిష్‌లాంటి వాటిని సంహరించడానికి దోహదపడుతాయని, సముద్ర జలాలు కలుషితం కాకుండా కాపాడవచ్చని పేర్కొంటున్నారు. అయితే వీటి మాంసానికి ఉన్న డిమాండ్ కారణంగా విచ్చలవిడిగా సంహరిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ప్రతి ఒక్కరూ తాబేళ్లను సంరక్షించాలని పిలుపునిస్తున్నారు. ఇందులో భాగంగానే అటవీ, వైల్డ్‌లైఫ్ అధికారులు సముద్ర తీర ప్రాంతాల్లో హేచరీలు ఏర్పాటు చేసి తాబేలు గుడ్లు పొదిగిన తర్వాత పిల్లలను సముద్రంలోకి వదులుతున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా తాబేళ్ల సంరక్షణకు ముందుకు రావాలని పిలుపునిస్తున్నారు.



తాబేళ్లు.. ఎన్నో మేళ్లు!

- సముద్రంలో జీవించే తాబేళ్ల కదలికల వల్ల పర్యావరణంలో సమతుల్యత దెబ్బ తినకుండా ఉంటుంది.
- మత్స్యసంపదకు సింహస్వప్నమైన జెల్లీ ఫిష్‌లను నివారిస్తాయి.
- సముద్రంలోని బండ రాళ్లపై నాచుని తినడం వల్ల బండలు శుభ్రంగా ఉండి చేపలు గుడ్లు పెట్టేందుకు అనుకూలంగా ఉంటుంది.
- తీర ప్రాంతం కోతకు గురికాకుండా దోహదపడుతాయి.
- సముద్రంలోని వ్యర్థాలు తినడంతో నీరు పరిశుభ్రంగా ఉండే అవకాశం ఉంది.

చిల్లకూరు: అంతరించి పోతున్న జీవకోటిలో ప్రధానంగా తాబేలు ఒకటి. అయితే దీనిని సంరక్షించేందుకు అటవీ, వైల్డ్ లైఫ్ శాఖలు నడుము కట్టాయి. ఇందులో భాగంగానే చెన్నైలోని సీ ఫౌండేషన్ సంస్థతో కలిసి జిల్లాలోని సముద్ర తీరంలో హేచరీలు ఏర్పాటు చేసి గుడ్లు పొదిగిస్తున్నాయి. ఆ తర్వాత తాబేలు పిల్లలను సముద్రంలోకి వదులుతున్నాయి. సముద్రంలోని జీవరాశులు అన్నీ సమానంగా ఉంటే జీవ వైవిధ్యానికి ఎలాంటి ఢోకా ఉండదు. అయితే ఇటీవల తాబేళ్లను సంహరించి సొమ్ము చేసుకునే వారు ఎక్కువ కావడంతో ఇవి నానాటికీ అంతరించి పోతున్నాయి. దీంతో సముద్రంలో జీవ వైవిధ్యం పూర్తిగా దెబ్బతింటోంది. తాబేళ్లు లేక పోవడంతో సముద్రంలోని నీరు కలుషితమవుతోందని ఆవేదన చెందుతున్నారు. దీని నివారణకు తాబేళ్లను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉద్ఘాటిస్తున్నారు.

తాబేళ్ల సంరక్షణకు పెద్దపీట

సముద్రం ఒడ్డున తాబేలు గుడ్లు పెడుతుంది. వీటిని ఏరి ఒక చోట ఉంచి పొందిగించి పిల్లలను చేసే బాధ్యతలను ఇటీవల కాలంలో అటవీ, వైల్డ్ లైఫ్ అధికారులు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే చెన్నైకి చెందిన సీ ఫౌండేషన్ సంస్థతో కలిసి తాబేళ్ల సంరక్షణ బాధ్యతలను 2005 నుంచి తీసుకున్నారు. వీటిని సూర్యుడు ఉదయించే సమయంలో లేత కిరణాలు వాటిపై పడుతున్నప్పుడు సముద్రంలోకి వదలుతారు. అయితే ఇవి సముద్రంలోకి వెళ్లిన 16 ఏళ్ల తర్వాత అవి ఎక్కడి నుంచి అయితే సముద్రంలోకి వెళ్లాయో అదే ప్రాంతానికి తిరిగి వచ్చి గుడ్లు పెడుతాయని శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది. తాబేలు జీవిత కాలం సుమారు 152 ఏళ్లు. ఆలీవ్ రిడ్లే తాబేళ్లు బంగాళాఖాతంలో ఎక్కువగా జీవిస్తాయి. ఇవి ప్రతి ఏడాదీ జనవరి నుంచి ఏప్రిల్ వరకు గుడ్లు పెడుతాయి. ఒక్కొక్కటీ సుమారు 75 నుంచి 150 వరకు గుడ్లు పెడుతుంటాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఇప్పటికే చిల్లకూరు, కోట, వాకాడు సముద్ర తీర ప్రాంతాల్లోని తీగపాళెం, శ్రీనివాసస త్రం, నవాబుపేట ప్రాంతాల నుంచి సుమారు 20 వేల తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదిలినట్లు అధికారులు చెబుతున్నారు.



సముద్రంలోకి వదులుతున్న తాబేలు పిల్లలు (ఇన్‌సెట్) ఆలీవ్ రిడ్లే తాబేలు పిల్లలు, పొదిగిస్తున్న గుడ్లు(ఫైల్)

తాబేళ్లను వదిలాం



వాకాడు, చిల్లకూరు, కోట మండలాల్లోని సముద్ర తీరంలోని బీచ్‌ల వద్ద ఇప్పటికే సుమారు 20 వేల తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదిలాం. ఉన్నతాధికారుల ప్రోత్సాహం బాగుంది. అందుకే ఐదు తీర ప్రాంతాల్లో గుడ్లు పొదిగించే ఏర్పాట్లు చేస్తున్నాం. పర్యాటకులు ప్లాస్టిక్ వ్యర్థాలను వదలి వెళితే అవి సముద్ర జలాల్లో కలిసి సముద్రంలోని జీవరాశుల మనుగడకు ముప్పు వాటిల్లితుంది. దీనిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– గాయం శ్రీనివాసులు(తమ్మినపట్నం సెక్షన్ అధికారి)

చర్యలు తప్పవు



సముద్రంలోని తాబేళ్లే కాకుండా నదులు, చెరువుల్లో, బావుల్లో జీవించే తాబేళ్లను కూడా ఎవరైనా అక్రమంగా పట్టి తరలిస్తున్నట్లు గుర్తిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు. నేరం రుజువైతే ఏడేళ్ల జైలు శిక్ష కూడా పడుతుంది. ప్రస్తుతం ఆలీవ్‌రిడ్లే తాబేళ్లను సముద్రంలోకి వదులుతున్నాం.

– సతీష్‌రెడ్డి(జిల్లా అటవీ అధికారి, తిరుపతి)

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం



పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి, పక్కన మేయర్ అముద

- ఎమ్మెల్యే, ఎంపీకి శుభాకాంక్షలు
- కక్షసాధింపు దాడులు సరికావు
- చిత్తూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి

చిత్తూరు (కార్పొరేషన్): ఎన్నికల సమయంలో పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తల మేలు మరువలేదని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు సరికాదన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ భయపడవద్దని.. అందరికీ అందుబాటులో ఉంటానని ధైర్య చెప్పారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓడినా పార్టీ శ్రేణులు కుంగిపోకుండా ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారు. ఎమ్మెల్యే గురజాల జగన్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు. చిత్తూరు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. టీడీపీ నాయకులు కక్షపూరితంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, వారి ఆస్తులను ధ్వంసం చేయిస్తుడం దారణమన్నారు. గతంలో ఎన్నడూ ఈ విధంగా జరగలేదన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదన్నారు. దాడులపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయినా కారకులైన వ్యక్తులను అరెస్ట్ చేయలేదన్నారు.


దాడులు సరికాదు

మేయర్ ఆముద మాట్లాడుతూ.. పార్టీ గెలుపున కోసం ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేశారన్నారు. టీడీపీ దాడుల వల్ల బాధిత కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారన్నారు. చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో గెలిచాక ఇటువంటి దాడులు తమ పార్టీ ప్రోత్సహించలేదని గుర్తు చేశారు. ప్రజా తీర్పును ఆహ్వానిస్తున్నమని, కానీ బలప్రదర్శన సరికాదన్నారు. వచ్చిన అవకాశంతో అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గెలుపు సంబరాలు చేసుకోవడం తప్పు కాదని.. ఆ సాకుతో గొడవలు చేయడం అన్యాయమన్నారు. సమావేశంలో నగర పార్టీ అధ్యక్షుడు టిమ్ము, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బాబునాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మూల్యాంకనం

ఇంటర్మీడియెట్ బోర్డు తరహాలో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనాన్ని ఆన్‌లైన్ విధానంలో అధికారులు ప్రారంభించారు. మూల్యాంకన ప్రక్రియలో అధునాతన మార్పులకు విద్యా శాఖ చర్యలు చేపట్టింది. ఈ విధానంలో విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా మూడంచెల విధానాన్ని తీసుకొచ్చింది. ప్రస్తుతం గణితం సబ్జెక్టు మాత్రం ఆన్‌లైన్ మూల్యాంకనాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. వచ్చే మార్చిలో అన్ని సబ్జెక్టులకు ఈ తరహా విధానం అమలు కానుంది.

- పది మూల్యాంకనంలో మార్పులు
- చిత్తూరులో ప్రారంభమైన ప్రక్రియ
- ఈ ఏడాది ప్రయోగాత్మకంగా గణితం సబ్జెక్టు



చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి మాన్యువల్ స్పాట్ వాల్యుయేషన్ స్థానంలో ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. పది సప్లిమెంటరీ పరీక్షలు గత నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరిగాయి. చిత్తూరు జిల్లాలో 1960 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 810 మంది పరీక్షలు రాశారు. వారికి 24 పేజీల జవాబు పత్రం బుక్‌లెట్ ఇచ్చారు. ఈ పత్రాలను విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, కర్నూలు, తిరుపతిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కేంద్రాల్లో పార్ట్–1 కాకుండా ఇతర జవాబు పత్రం మొత్తం స్కాన్ చేసే ప్రక్రియను చేపట్టారు. ఆన్‌లైన్ పాఠాలు బోధించేందుకు ఇచ్చిన ట్యాబ్స్ సహాయంతో ఉపాధ్యాయులు ఈ జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తారు. ఒక్కొక్కరికి 75 వరకూ జవాబు పత్రాలను కేటాయిస్తారు.ప్రతి జిల్లా నుంచి 50 మంది చొప్పున మొత్తం 1,200 మంది కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఉపాధ్యాయులను ఎంపిక చేసి జాబితాలను పంపించాలని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి ఇప్పటికే జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేశారు. ఉపాధ్యాయులు ట్యాబ్‌లలో లాగిన్ అయితే తెరపై ఒకవైపు జవాబు పత్రం, మరోవైపు మార్కులు వేసేందుకు టేబుల్ వస్తుంది. జవాబు పత్రంలో సమాధానం చూసి దానికి మార్కులు టేబుల్‌లో వేస్తారు. ఇలా ఒక ఉపాధ్యాయుడు దిద్దిన జవాబు పత్రాన్ని మరో టీచర్‌కు పంపించి మూల్యాంకనం చేయిస్తారు. ఈ ఇద్దరి మూల్యాంకనంలో పది శాతం కంటే ఎక్కువ మార్కుల తేడా వస్తే అప్పుడు మూడో ఉపాధ్యాయుడికి పంపించి అక్కడ వచ్చిన మార్కులను ఫైనల్ చేస్తారు. రీ కరెక్షన్, రీటోటలింగ్ విధానాలకు స్వస్తి పలికేందుకు ఆన్‌లైన్ ప్రక్రియకు అధికారులు శ్రీకారం చుట్టారు.

ప్రారంభమైన మూల్యాంకనం

జిల్లాలో పదో తరగతి జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనం గురువారం నుంచి ప్రారంభం అయ్యింది. జిల్లా కేంద్రంలో ఉన్న పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూల్యాంకనాన్ని స్పాట్ కేంద్రం క్యాంప్ ఆఫీసర్ జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు ప్రారంభించారు. స్పాట్ కేంద్రాన్ని ఈ నెల తొమ్మిదవ తేదీతో ముగించాల్సి ఉంది. వివిధ జిల్లాల నుంచి గణితం మినహా 6 వేల జవాబు పత్రాలను కేటాయించారు. ఆ జవాబుపత్రాలను దిద్దేందుకు 100 మంది టీచర్లను నియమించారు.

పకడ్బందీగా మూల్యాంకన ప్రక్రియ



రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జారీ చేసిన నియమ నిబంధనలను పాటిస్తూ పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనం చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. గురువారం ప్రక్రియను ప్రారంభించాం. ఈ నెల 9 వ తేదీ వరకు ప్రక్రియ జరుగుతుంది. ముఖ్యంగా స్పాట్ కేంద్రంలో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులకు తాగునీరు, ఫర్నీచర్ తదితర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశాం. రాష్ట్ర ఉన్నతాధికారులు ఇచ్చిన గడువులోగా జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేస్తాం.

– దేవరాజు, డీఈఓ, చిత్తూరు జిల్లా

ముగిసిన సార్వత్రిక ఎన్నికల కోడ్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల కోడ్ గురువారంతో ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం మార్చి 16వ తేదీన ప్రవర్తనా నియమావళిని అమలులోకి తీసుకొచ్చిందన్నారు. ఈనెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు ముగియడంతో ఎన్నికల సంఘం జారీచేసిన షెడ్యూల్ ప్రకారం కోడ్ ముగిసిందన్నారు. ప్రశాంత ఎన్నికలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

గోడౌన్‌లో ఈవీఎంల భద్రత

సార్వత్రిక ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలను గురువారం కలెక్టరేట్‌లోని గోడౌన్‌లో భద్రపరిచినట్లు డీఆర్‌ఓ పుల్లయ్య వెల్లడించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రం నుంచి కలెక్టరేట్‌కు ఈవీఎంలను పకడ్బందీగా తరలించినట్లు చెప్పారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వాటిని పకడ్బందీగా పరిశీలించామన్నారు. అసెంబ్లీలు, చిత్తూరు పార్లమెంట్‌స్థానం ఎన్నికల పోలింగ్‌కు వినియోగించిన ఈవీఎంలను భద్రపరిచి గోడౌన్‌కు సీల్ వేసినట్లు డీఆర్‌ఓ పుల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవీఎం మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి శ్రీదేవి, పలు పార్టీలకు చెందిన ప్రతినిధులు ఉదయ్, సురేంద్రకుమార్, సిబ్బంది సరిత, శోభ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్



గోడౌన్‌లో ఈవీఎంలను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య

పార్టీ శ్రేణులకు అండగా

కమిటీల ఏర్పాటు

సాక్షి, తిరుపతి: రాష్ట్రంలో ఎన్నికల ఫలితాల తర్వాత భయానక వాతావరణం నెలకొంది. ప్రభుత్వం ఏర్పాటు కాకముందే టీడీపీ మూకలు రాష్ట్ర వ్యాప్తంగా చెలరేగిపోతున్నారు. ఎక్కడికక్కడ దాడులకు తెగబడుతున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు దిగుతూ అత్యంత పాశవికంగా ప్రవర్తిస్తున్నారు. ఈ సమయంలో పార్టీ నాయకులకు అండగా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం కమిటీలను పార్టీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటుందని, అలాగే అక్కచెల్లెమ్మలు, సోషల్‌మీడియా సైనికులకు తోడుగా నిలుస్తుందని ప్రకటించింది. బాధిత కుటుంబాలను పరామర్శించడమే కాకుండా, వారిని అన్ని రకాలుగా ఆదుకుంటామని ఆ ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు చిత్తూరు పార్లమెంటు పరిధిలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భరత్, ఆర్కే రోజా, సునీల్‌కుమార్, వెంకటేగౌడ, రెడ్డెప్ప, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, కృపాలక్ష్మి, విజయానందరెడ్డిని నియమించింది. తిరుపతి పార్లమెంటు పరిధిలో నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, ఎం.గురుమూర్తి, బల్లి కల్యాణ్ చక్రవర్తి, మేరిగ మురళీధర్, సిపాయి సుబ్రమణ్యం, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కే.సంజీవయ్య, బియ్యపు మధుసూధన్‌రెడ్డి, భూమన అభినయ్, ఎస్.రాజేష్‌ను నియమించినట్లు అందులో పేర్కొంది.

క్లుప్తంగా

వ్యాక్సినేషన్ లక్ష్యాన్ని అధిగమించాలి



సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని సత్యనారాయణపురం అర్బన్ సెంటర్‌లో గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని డీఎం అండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాక్సినేషన్ అమలుతీరుపై సిబ్బందిని ఆరా తీశారు. లక్ష్యాన్ని అధిగమించాలని ఆదేశించారు. గ్రామీణ స్థాయిలో వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించాలని సిబ్బందికి వివరించారు. వైద్యాధికారులు నిత్యసాయి, శృతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

బంగారుపాళెం: మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి కాటప్పగారిపల్లె వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మహాసముద్రం గ్రామానికి చెందిన రాజేంద్ర(60) ద్విచక్రవాహనంపై బంగారుపాళెం వైపు వెళుతుండగా చిత్తూరు నుంచి నంగిలికి వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేంద్ర తలకు బలమైన గాయం తగిలింది. క్షతగాత్రుడిని అదే కారులో చికిత్స నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొంతులోకి నేరుగా గరళం

పలమనేరు రెవిన్యూ డివిజన్‌లో మినరల్ వాటర్ పేరుతో దోపిడీ జరుగుతోంది. ప్రజలు మినరల్ బాటిళ్ల నీళ్లకే అలవాటు పడుతున్నారు. దుకాణాలు, హోటళ్లు, దాబాల్లో సాధారణ నీటికి బదులు మినరల్ వాటర్‌నే విక్రయిస్తున్నారు. ఐఎస్‌ఐ నాణ్యత ప్రమాణాలను ఏమాత్రం పాటించకుండా రకరకాల బ్రాండ్ల పేరుతో జనాన్ని బురిడీ కొట్టిస్తున్నారు. వాటర్ ప్లాంట్లు, ఇళ్ల వద్దకు అందించే వాటర్ క్యాన్లకు సైతం ఐఎస్‌ఐ ముద్ర ఉండడం లేదు. ఈ నీళ్లను తాగేవారు రకరకాల వ్యాధులతో బాధ పడాల్సి వస్తోంది.

మినరల్ వాటర్ పేరిట నకిలీ విక్రయాలు

- నాణ్యత ప్రమాణాలకు వాటర్‌ప్లాంట్ల పాతర
- బాటిళ్లపై కనిపించని ఐఎస్ఐ మార్కు
- ఒకే బ్రాండ్ పేరుతో అక్షరాలు మార్చి మోసం
- ప్రజారోగ్యంతో చెలగాటం



ఆక్వాఫినా లాంటి ఆక్వాకేర్



బిస్‌లెరి పేరులా కనిపించే బిస్‌పెరీ, బ్రూక్‌లీ, బెర్‌సిలి, నీళ్ల బాటిళ్లు

పలమనేరు: మండల కేంద్రాలతో పాటు మున్సిపాలిటీలో మినరల్ వాటర్ బాటిళ్లు, క్యాన్ల విక్రయాలు ఎక్కువయ్యాయి. ఎడాపెడా వాటర్ ప్లాంట్లు, ఇళ్ల వద్దే నీటిని విక్రయించే ట్యాంకు ఆటోలు పల్లెల్లోనూ పెరిగాయి. ప్రజల అలవాటును గమనించి కొందరు నిబంధనలకు విరుద్ధంగా వాటర్‌ప్లాంట్లను నిర్వహిస్తున్నారు. వీటిల్లో దేనికి ఐఎస్ఐ ఉందో దేనికి లేదో కూడా తెలియని అయోమయం నెలకొంది. సాధారణ నీటినే ట్యాంకర్లతో తెచ్చి మినరల్ వాటర్ అనిచెప్పి ఏమార్చేస్తున్నారు. విధిలేక ఈ నీటినే జనం కొనాల్సి వస్తోంది. ఫలితంగా జలుబు, గొంతునొప్పి లాంటి సమస్యలు తప్పడం లేదు.

చిన్నపాటి స్పెలింగ్‌ను మార్చి..

మినరల్ వారట్ బ్రాండ్ అయిన కిన్‌లే పేరు కనిపించేలా స్పెలింగ్ మార్చి కైన్‌లే, కాన్లే తదితర పేర్లతో జనాన్ని ఏమార్చుతున్నారు. బిసెలరీ ఒరిజినల్ బ్రాండ్‌ను బ్రూక్‌లిన్, బెల్‌స్రీ, బిల్‌సిరి, బిసలరీ, బ్రిస్లీగా మార్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అక్వాఫినాకి బదులు ఆక్వాఫినా, ఆక్వాపిస్ లాంటి పేర్లను వాడుతున్నారు. ఈ విషయం తెలియని చాలామంది ఇది అసలైందే అనుకొని తాగుతున్నారు.

కౌన్సిల్‌లో తెరపైకొచ్చినా...

గతంలో మున్సిపల్ సమావేశంలో పట్టణంలో సాగుతున్న అక్రమనీటి వ్యాపారంపై పాలకమండలి ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై సంబంధిత శాఖల ద్వారా తనిఖీలు చేపట్టాలని పాలకవర్గం అధికారులను ఆదేశించింది. ఆయన సైతం స్పందించి వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు. దీంతో నీళ్ల వ్యాపారం మూడు క్యాన్లు ఆరు ట్యాంకర్లుగా సాగుతూనే ఉంది.

నిబంధనలకు నీళ్లు..

పలమనేరు డివిజన్‌లో వందకుపైగా మినరల్ వాటర్ ప్లాంట్ యూనిట్లు ఉన్నాయి. వీటి నుంచి నీటిని క్యాన్లకు రీటైల్‌గా విక్రయిస్తున్నారు. నీటిని శుద్ధి చేశారాలేదా అనే సంగతి ఎవరికీ తెలియదు. వాటర్‌ప్లాంట్లు లేకనే బోర్ల నీటని నింపి మినరల్ పేరిట విక్రయించే ట్యాంకర్లు వందకుపైగా ఉన్నాయి. వాటర్‌ప్లాంట్ల అక్రమాల వ్యవహారాలను తేల్చాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్, ఆహార కల్తీ నిరోధకశాఖ, ఫుడ్ కంట్రోలర్, మున్సిపల్ అధికారులు, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

నిబంధనలు ఇలా...

మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలంటే తొలుత బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్)కు దరఖాస్తు చేసుకోవాలి లేదా ఐఎస్ఐ (ఇండియన్ స్టాండర్డ్ ఇన్సిట్యూషన్) ద్వారా అనుమతులు పొందాలి. ముంబై, చెన్నైకు చెందిన ఈ సంస్థలు తమ బృందాన్ని పంపి నీటి నాణ్యత ప్రమాణాలపై తనిఖీలు నిర్వహిస్తుంది. బోరు పాయింట్ నుంచి వచ్చే నీళ్లను ల్యాబ్‌కు పంపి అన్ని రకాల పరీక్షలు జరుపుతుంది. ఆపై అనవసర లవణాలను తీసివేసి ఆరోగ్య దాయకంగా నీటిని తయారు చేయాల్సి ఉంటుంది. అన్ని సంతృప్తి కరంగా ఉంటే ఐఎస్ఐ సర్టిఫికెట్‌ను జారీ చేస్తుంది. ఈ ప్లాంటుకు సంబంధించిన అనుమతి, స్ట్రక్చర్ తదితరాలను మాత్రం సంబంధిత పంచాయతీలు, మున్సిపల్ అధికారులు పరిశీలిస్తారు. ఈ తతంగమంతా ఇక్కడి వాటర్‌ప్లాంట్లలో కనిపిస్తే ఒట్టు. మరి కొందరు చెన్నైలోని బయోహెర్బల్ సంస్థ నుంచి తూతూమంత్రంగా సర్టిఫికెట్లను తెచ్చుకొని ఈ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఇప్పటికైనా ఈ అక్రమాలపై జిల్లా యంత్రాంగం స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అధికారులు పట్టించుకోవాలి



పలమనేరులో ఎక్కడ చూసినా డూప్లికేట్ కంపెనీ నీళ్ల బాటిళ్లు విక్రయిస్తున్నారు. ఇవేం కంపెనీలని విక్రయించే వారినడిగితే ఎవరో ఏజెన్సీ వారు ఇచ్చారనే సమాధానం వస్తోంది. ఇలాంటి నీటిని తాగితే ఆరోగ్య సమస్యలు తప్పవు. ఇంత జరుగుతున్నా జిల్లా ఆహారకల్తీ నిరోధకశాఖ ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. – వై.రామచంద్రారెడ్డి, పలమనేరు

నిర్వాహకులపై చర్యలు తప్పవు



నకిలీ వాటర్ బాటిళ్ల విక్రయాలపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పట్టణ పరిధిలో నిబంధనలనుకు విరుద్ధంగా వాటర్‌ప్లాంట్ల వ్యాపారంపై పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ మీట్‌లో గతంలో ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. మరోసారి ఈ వ్యవహారంపై అధికారులతో చర్చించి చర్యలు తీసుకునేలా చూస్తాం. – చాముండేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్, పలమనేరు

కంప్యూటర్ డెస్క్‌టాప్ పబ్లిషింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో జూన్ 10 తేదీ (సోమవారం) నుంచి 30 రోజుల పాటు పూర్తి ఉచితంగా పురుషులు, మహిళలకు కంప్యూటర్ డెస్క్‌టాప్ పబ్లిషింగ్(డీటీపీ)పై ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్టు సంస్థ డైరెక్టర్ పీ.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ పురుషులు, మహిళలు శిక్షణకు అర్హులని తెలిపారు. కనీస విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలని, శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ధ్రువ పత్రాలు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేయించుకోవలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట , చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289, 63017 17672 సంప్రదించాలన్నారు.

సరిహద్దులో తమిళ రాజకీయ ప్రభావం

- ఆరు నియోజకవర్గాల్లో మార్పును కోరుకున్న వైనం
- దీనిపై కూడా రాజకీయవేత్తల విశ్లేషణ

పలమనేరు: మన జిల్లాకు పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో జయలలిత ఉన్నంత వరకు డీఎంకే ఓసారి అధికారంలోకి వస్తే మళ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేకు అక్కడి ప్రజలు పట్టం కట్టేవారు. జిల్లాలో రెండు దశాబ్దాల రాజకీయాలను గమనిస్తే ఇక్కడా అదే రీతి కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగా, 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చింది. అయితే 2014 ఎన్నికల్లోనూ టీడీపీ అధికారంలోకి వచ్చినా జిల్లాలో మాత్రం ఎక్కువమంది ఎమ్మెల్యేలు గెలవడం ద్వారా వైఎస్సార్‌సీపీదే పైచేయిగా మారింది. ఈసారి ఎన్నికల్లో చిత్తూరు జిల్లాలో మొత్తం ఏడు నియోజకవర్గాలుండగా ఇందులో పుంగనూరు మినహా మిగిలిన ఆరుచోట్ల ప్రజలు మార్పు కోరుకున్నారు.

కుప్పం మినహా..

పలమనేరు, పూతలపట్టులోని బంగారుపాళెం మండలం, చిత్తూరు, జీడీనెల్లూరు, నగరినియోజకవర్గాలో ఇప్పటికీ తమిళుల మూలాలున్నాయి. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా తమిళనాడులోని నార్త్ ఆర్కాడ్ జిల్లాలో ఉంటూ భాషాప్రయుక్త రాష్ట్రాల్లో భాగంగా ఏపీలోకి చేరింది. దీంతో అనాధికారికంగా ఇక్కడ తమిళ కుటుంబాలు, తమిళ భాష మాట్లాడే కుటుంబాలు వేలసంఖ్యలో ఉన్నాయి. ఇలా ఇక్కడి తమిళభావాలున్న వారు సైతం నాటి తమిళ పంథాను కొనసాగిస్తున్నారా అనే కోణంలోనూ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కానీ కుప్పంలో మాత్రం చంద్రబాబునే తమిళులు కోరుకుంటున్న విషయాన్ని గుర్తుంచుకోవాల్సిందే.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 67,320 మంది స్వామివారిని దర్శించుకోగా, 28,495 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.03 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

చక్రస్నానం..సకల పాపహరణం



పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



స్కంధ పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు అవభృథ స్నానం

కార్వేటినగరం: కార్వేటినగరంలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు గురువారం ఉదయం చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం చక్రత్తాళ్వార్, రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవర్లను స్కంధ పుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. అక్కడ వేదోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. వేద పండితులు వేదమంత్రాల నడుమ స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. తొమ్మిది గంటలకు చక్రత్తాళ్వార్‌కు స్కంధ పుష్కరిణిలో శాస్త్రోక్తంగా అవభృథ స్నానం చేపట్టగా, అదే సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో వేణుగోపాలుడు తిరుచ్చి వాహనంపై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. కంకణబట్టు నారాయణ దాశరథికి పట్టు వస్త్రాలతో టీటీడీ అధికారులు ఆలయ మర్యాదలు చేశారు. డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోముశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబుసురేష్ పాల్గొన్నారు.

నేడు పుష్పయాగ మహోత్సవం

ఆలయంలో శుక్రవారం పుష్పయాగ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 1.30 నుంచి 3.30 గంటల మధ్య పుష్పయాగ మహోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలను పొందాలని కోరారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై అపోహలు వద్దు



తవణంపల్లెలో బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్

బంగారుపాళెం: క్షయ వ్యాధి నివారణ కోసం వేస్తున్న బీసీజీ వ్యాక్సిన్‌పై అపోహలు వద్దని జిల్లా క్షయ నివారణాధికారి, అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటప్రసాద్ అన్నారు. మండలంలోని గుంతూరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలు క్షయ వ్యాధి భారిన పడకుండా ముందస్తుగా బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నట్లు చెప్పారు. బీసీజీ వ్యాక్సిన్‌పై ఎలాంటి భయం, అపోహ వద్దని సూచించారు. ప్రతి ఇంటికీ సిబ్బంది వెళ్లి బీసీజీ వ్యాక్సిన్ వేస్తారు. బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో నిలిచిందన్నారు. ప్రథమ స్థానంలో నిలిపేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్, ఎంపిహెచ్‌ఈఓ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌ను వేగవంతం చేయాలి

తవణంపల్లె: బీసీజీ వ్యాక్సిన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా క్షయవ్యాధి నివారణ జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ ఆదేశించారు. మండలంలోని తవణంపల్లె, అరగొండ, గాజులపల్లె, చెర్లోపల్లె, దిగువమాఘం, పైమాఘం సచివాలయాల్లో బీసీజీ వ్యాక్సినేషన్‌ను ఆయన పరిశీలించారు. 18 ఏళ్లు పైబడి 60 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన షుగర్‌వ్యాధి గ్రస్తులు, 60 ఏళ్లు పైబడిన వారందరికీ బీసీజీ వ్యాక్సిన్ తప్పని సరిగా వేయాలని తెలిపారు. మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ పదవులకు పలువురి రాజీనామా



బంగారుపాళెం: నామినేటెడ్ పదవులకు రాజీనామా చేసిన కుమార్‌రాజా, నాయకులు



పుంగనూరు: కొండవీటి నాగభూషణం

బంగారుపాళెం: పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ పదవికి గురువారం కుమార్‌రాజా రాజీనామా చేశారు. రాజీనామాను మెయిల్ ద్వారా బీసీ వెల్ఫేర్ చీఫ్ సెక్రెటరీకి పంపారు. అదే విధంగా ముగ్గురు కార్పొరేషన్ డైరెక్టర్లు కూడా రాజీనామాలు చేశారు. తగ్గువారిపల్లెకు చెందిన ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ చెంగల్‌రాయులు, బోడబండ్లకు చెందిన వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మొగిలీశ్వర్, టేకుమంద గ్రామానికి చెందిన కురబకార్పొరేషన్ డైరెక్టర్ అమరనాథ్ తమ పదవులకు రాజీనామా చేశారు. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నారే సోమశేఖర్ పదవికి రాజీనామా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందడంతో స్వచ్ఛందగా రాజీనామా చేసినట్లు తెలిపారు. తాము వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తామన్నారు.

జానపద కళల సంస్థ చైర్మన్..

పుంగనూరు: రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం గురువారం పదవికి రాజీనామ చేశారు. ఈ మేరకు రాజీనామ లేఖను ఆయన ప్రభుత్వానికి పంపారు.సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందడంతో పదవికి రాజీనామ చేస్తున్నట్లు ప్రకటించారు. తనకు అన్ని విధాలా సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా పోలీసులకు ప్రశంసలు



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో శ్రమించి, చట్టాన్ని అమలు చేయడంలో నిక్కచ్చిగా వ్యవహరించిన జిల్లా పోలీసు యంత్రాంగానికి ప్రశంసలు లభించాయి. గురువారం మంగళగిరిలోని పోలీసు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఈబీ కమిషనర్ ఎం.రవిప్రకాష్ చేతులు మీదుగా అధికారులు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఎన్నికల వేళ అక్రమ మద్యం అడ్డుకోవడం, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపడం లాంటి చర్యలను ప్రశంసించారు. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఏవీ సుబ్బరాజు, అధికారులు శ్రీధర్‌రావు, హరికృష్ణ, నాగరాజ, ఉమామహేశ్వర్, సుధాకర్ రాజు, దొరబాబు, సురేష్‌రెడ్డి, శ్రీనివాసులు, విజయ్‌కుమార్, శ్రీనివాసులు, బాపూజీ నాయక్, గోవిందస్వామి, వెంకటేష్, జయశంకర్‌కు ప్రశంసా పత్రాలను అందచేశారు. సమర్థవంతంగా పనిచేసిన అధికారులను అభినందిస్తున్నట్టు చిత్తూరు ఎస్పీ మణికంఠ పేర్కొన్నారు.

శ్రీషిర్డీ సాయి మందిరానికి రూ.3,00116 విరాళం



వెండి మాలను విరాళంగా అందజేస్తున్న ఉమా

తిరుపతి కల్చరల్: కొంకావీధిలోని శ్రీద్వారకమయి శ్రీషిర్డీ సాయి బాబా సేవా సమాజ్ సాయి బాబా మందిరానికి భక్తులు గురువారం రూ.3,00,116 విరాళంగా అందజేశారు. పూతలపట్టుకు చెందిన డి.దామోదర నాయుడు రూ.2 లక్షలు సప్తగిరి గ్రామీణ బ్యాంకులో నెట్ బ్యాంకింగ్ ద్వారా విరాళం అందించారు. ఎ.రామ్‌మోహన్ సతీమణి పార్వతమ్మ జ్ఞాపకార్థం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. కేశవాయనగుంటకు చెందిన భక్తురాలు ఉమా 108 రుద్రాక్షల వెండి మాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీషిర్డీ సాయి సేవా సమాజ్ గౌరవాధ్యక్షుడు మబ్బు దేవనారాయణరెడ్డి, కార్పొరేటర్ కుడితి సుబ్రమణ్యం, దుర్గం శ్రీనివాస్, మర్దం శివ, పి.వి జయలక్ష్మి, సి.రమేష్, కె.హరిబాబు, బి.కళావతి, మనోహర్, బాలకృష్ణ, వై.లక్ష్మి, కె.ప్రభాకర్, సాయి భక్తులు పాల్గొన్నారు.